ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

వార్త

శుక్రవారం 10, మే 2024 8 పేజీలు




## అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులలో పనిచేసే బృందాలు పకడ్బందీగా పనిచేయాలి

-ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి
-పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి
-ఎన్నికల అబ్జర్వర్ రచిత్‌రాజ్

4వ పేజీలో...



# జంప్ జలానీలు!

◆ మన్యంలో పార్టీ ఫిరాయింపులు
◆ రోజుకో రంగు మారుస్తున్న నేతలు
◆ అయోమయంలో కార్యకర్తలు
◆ నేతల వైఖరిపై ప్రజల్లో అసహనం
◆ ఏజెన్సీలో నయా పాలిట్రిక్స్

**భద్రాచలం, ప్రభాతవార్త :** చొక్కాలు మార్చినంత సులభంగా ఏజెన్సీలో కొందరు పార్టీలు మారుస్తున్నారు. ఎప్పుడు, ఎవరు, ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి. రోజుకో రంగు మారుస్తున్న కొందరు పార్టీ నేతల వైఖరితో కింది స్థాయి కార్యకర్తలు అయోమయానికి లోనవుతున్నారు. ఆనాదిగా వస్తున్న ఏజెన్సీ సాంప్రదాయాలను తుంగలో తొక్కి అధికార దాహంతో ప్రజాక్షేత్రంలో పావులు కదుపుతున్న కొందరి నేతల పోకడపై ప్రజల్లో రోజు రోజుకు అసహనం రెట్టింపు అవుతోంది. ఔరా ఇవెక్కడి రాజకీయాలు అంటూ స్థానిక ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. భద్రాచలం ఏజెన్సీలోకి చొరబడ్డ నయా పాలిట్రిక్స్ గందరగోళానికి దారి తీస్తున్నాయి. కాలమే ఇటువంటి నేతలకు సమాధానం చెపుతుందని రాజకీయ పండితులు వ్యాఖ్యానిస్తున్నారు.

2వ పేజీలో...





- పాల్వంచ, పరిసర ప్రాంతాల్లో జోరుగా విక్రయాలు
- అడ్డుకట్ట వేయని అధికారులు
- అధిక ధరలకు విక్రయిస్తున్న దళారులు

# ఆగని ఇసుక దందా

**పాల్వంచ క్రైం, ప్రభాతవార్త :** ఎలాంటి నిర్మాణ పనులు అయినా సరే ఎక్కువగా వేసవికాలంలోనే జరుగుతుంటాయి. ఎందుకంటే వేసవి కాలంలో వర్షాలు ఎక్కువగా ఉండవు కాబట్టి నిర్మాణ పనులు చెకచెక్కజరుగుతుంటాయి. చలికాలంలో కూడా నిర్మాణ పనులు చేస్తారు కానీ తక్కువే అని చెప్పాలి. అయితే నిర్మాణ పనులకు ఎంతో ముఖ్యమైన ఇసుకకు ఇప్పుడు డిమాండ్ మరింతగా పెరిగింది. గతంలో రూపాయికి వస్తే ఇప్పుడు మూడు రూపాయలు పెట్టినా కూడా ఇసుక దొరకడం లేదని యజమానులు చెప్తున్నారు. అయితే తాత్కాలికంగా ఇసుక కొరతను చూపిస్తు అధికంగా వసూలు చేయడమే ధ్యేయంగా ఇసుకాసరులు అక్రమ సంపాదనకు తెరలేపారని పలువురు చెప్పుకుంటున్నారు.

4వ పేజీలో...

## మున్నేరులో ముగ్గురు చిన్నారులు గల్లంతు

ఇద్దరి మృతదేహాలు లభ్యం
బాధిత కుటుంబాలను ఆదుకోవాలని సిపిఐ డిమాండ్

**క్రైం ఖమ్మం, మే 9, ప్రభాతవార్త:** గుదిమళ్ళ ప్రాంతంలోఉన్న మున్నేరు నీటి గుంటలో ముగ్గురు చిన్నారులు మనకకు గురయ్యారు. ఈతకు వెళ్లి ముగ్గురు ఆ నీటి గుంతలో

2లో..



## స్వీప్ కార్యాచరణలో భాగంగా నేడు బైక్ ర్యాలీ

ఉద్యోగులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి
కలెక్టర్ వి.పి.గౌతమ్



8వ పేజీలో...

# ఎన్నికల ప్రచార హోరు

రేపటితో ముగియనున్న మైక్‌ల ప్రచారం
చివరి అంకానికి చేరిన పార్టీల ప్రచారం



**సత్తుపల్లి, ప్రభాతవార్త:** ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలు ప్రధాన రాజకీయ పార్టీలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎవరికి వారు తమ అభ్యర్థుల గెలుపు కోసం నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో తమ వ్యూహ, ప్రతి వ్యూహాలతో కొనసాగిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలో పోటీ చేసే వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల నామినేషన్‌ల ముగింపు దగ్గరి నుండి గత 10 రోజులుగా వారి గెలుపు కోసం ప్రజలకు తాము చేసిన పనులు వివరిస్తూ విస్తృతంగా గ్రామాల్లో పర్యటించారు. ఈనెల 13న జరగనున్న ఖమ్మం పార్లమెంట్ ఎన్నికలకు సీపీఎం, సీపిఐ, తెలుగుదేశం పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి రామ సహాయం రఘురామరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నుండి నామా నాగేశ్వరరావు, బీజేపీ పార్టీ నుండి తాండ్ర

2లో..

# జంప్ జలానీలు!

**(మొదటి పేజీ తరువాయి..)**

### -మన్యంలో పార్టీ ఫిరాయింపులు

భద్రాచలం ఏజెన్సీలో గతంలో చక్కని రాజకీయ సాంప్రదాయం ఉండేది. తరతరాలుగా పార్టీలనే అంటిపెట్టుకుని కొందరు రాజకీయం చేసేవారు. పైసా లేకుండానే ప్రజాప్రతినిధులు అయ్యేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. గత దశాబ్దాల కాలంగా ఏజెన్సీలో రాజకీయాల్లో తీవ్రమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి ఉంటే ఆ పార్టీలోకి నేతలు వలసలు వెళ్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పద్దతులు ప్రారంభం కాగా .. ప్రస్తుతం ఇప్పుడు పరాకాష్టకు చేరాయి. ఇటీవల కాలంలో పార్టీలు మారుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక టీడీపీ నుంచి పెద్ద సంఖ్యలోనే ఆ పార్టీకు చెందిన నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. మళ్ళీ ఇదే నేతలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఇంకా రోజు రోజుకు కొందరు చేరుతూనే ఉన్నారు. ఇది అధికార దాహమా ..? లేక మరేంటని ప్రజలు తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. ఎన్నికల సమయంలో ఈ పార్టీ ఫిరాయింపులు మరీ ఎక్కువ అవుతున్నాయి. నేతల వైఖరితో కార్యకర్తలు గందరగోళానికి లోనవుతున్నారు. వారికి ఏమీ పాలుపోని స్థితి ఏర్పడుతోంది.

### -రోజుకో రంగు మారుస్తున్న నేతలు

వివిధ పార్టీలకు చెందిన కొందరు నేతలు రోజుకో పార్టీలో దర్శనమిస్తున్నారు. ఎప్పుడు ఎవరు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఊసరవెల్లి రాజకీయాలు కొందరు చేస్తున్నారంటూ బాహటంగానే ప్రజలు విమర్శిస్తున్నారు. అధికార పార్టీలో ఉంటే అన్ని సక్కపడతాయని కొందరు, నాలుగు రూపాయలు పక్కనేసుకోవచ్చునని మరికొందరు, తమను రక్షించుకోవచ్చునని ఇంకొందరు ఇలా రకరకాల ప్రయోజనాలను ఆశించి కొందరు నేతలు పార్టీలు మారుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటువంటి నేతలపై ప్రజలు అసాహించుకుంటున్నారు. అసలైన కార్యకర్త మాత్రం పార్టీని వీడకుండా అలానే తమ అభిమానాన్ని చాటుకుంటున్న వారు లేకపోలేదు. కింది స్థాయి కార్యకర్తలు పార్టీలు మారుతున్న నేతలతో ఇబ్బందులు పడుతూ తమ అభిమానాన్ని వీడలేక ఆయా పార్టీలోనే కొనసాగుతూ పార్టీలు మారుతున్న వారికి ఆదర్శంగా నిలుస్తున్న కార్యకర్తలు ఉన్నారు. ఇటీవల కాలంలో పార్టీలు మారటమే ప్రధాన హాబీగా కొందరు వ్యవహరించడం రాజకీయాలంటేనే ఇబ్బంది పడే పరిస్థితులు దాపురించాయని ప్రజలు విమర్శిస్తున్నారు. తాత్కాలికంగా లబ్ధి పొందుతున్నారే తప్ప ఇటువంటి వారికి కాలంమే సమాదానం చెపుతున్నారని రాజకీయ పండితులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

### -ఏజెన్సీలో నయా పాలిట్రిక్స్

దేశ, రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఫిరాయింపులు సాదారణంగానే ఉన్నా .. కాస్తో .. కూస్తో భద్రాచలం ఏజెన్సీలో చక్కని సాంప్రదాయం ఉండేది. పార్టీని అంటి పెట్టికుని పార్టీ అబివృద్ధికి కష్టపడే నేతలు ఉండేవారు. ఇప్పుడు అటువంటి నేతలను ఏల్ల మీద లెక్కపెట్టే పరిస్థితి వచ్చేసింది. ఏజెన్సీలో అడుగు పెట్టిన నయా పాలిట్రిక్స్ సామాన్య మానవుడు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితినే లేకుండా పోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కో పార్టీ అభ్యర్థి రూ.20కోట్లకు పైగానే ఎన్నికల ఖర్చు చేశారంటే ఇక్కడ రాజకీయం ఎంత వేడెక్కిందో అర్థం చేసుకోవచ్చు. డబ్బుతోని రాజకీయాలను శాసించవచ్చు అనే పద్దతి ఏజెన్సీలోకి ప్రవేశించడంతో ఇక ప్రజాప్రతినిధి అవ్వాలంటే భారీగా సొమ్ములుండాల్సిందేనన్న ప్రచారం సాగుతుంది. సామాన్యుడు ప్రజాప్రతినిధి అయ్యే పరిస్థితినే లేకుండా పోయిందని కొందరు ఆశావహులు తీవ్రంగా కలత చెందుతున్నారు. త్వరలో గ్రామపంచాయతీ, మండల పరిషత్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పలువురు పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారని, ఇందులో కూడా రాజకీయ వ్యూహమే దాగి ఉందని తెలుస్తోంది. ఇప్పటి నుంచే వ్యూహాలకు కొందరు పదును పెడుతున్నారని సమాచారం. ఏదేమైనా ప్రశాంత రాజకీయాలకు కొలువైన భద్రాచలం మన్యంలో పార్టీ ఫిరాయింపులు అశాంతిని నింపుతున్నాయి. ఇది రానున్న రోజుల్లో ఎటువంటి పరిణామాలకు దారితీస్తాయో వేచి చూడాల్సిందే.

# మున్నేరులో ముగ్గురు చిన్నారులు గల్లంతు

**(మొదటి పేజీ తరువాయి..)**

గల్లంతు కావడంతో పోలీసులు గత ఈతగాళ్లను రంగంలోకి దింపి గాలించగా, ఇద్దరి మృతదేహాలు లభించాయి. మరొకరి కోసం గాలిస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో సరదాగా ఈతకు వెళ్లిన తమ పిల్లలు శివాలయం కనిపించడంతో తల్లిదండ్రులు బంధువులు గుండెల విసేలా రోదిస్తున్నారు. ఈ ప్రమాదంలో లోకేష్, గణేస్ అనే ఇద్దరు చిన్నారుల మృతదేహాలను వెలికి తీశారు.

### – బాధిత కుటుంబాలను ఆదుకోవాని సిపిఐ డిమాండ్ –

గుదిమళ్ల వద్ద యేటిలో పడి మృతి చెందిన పిల్లల కుటుంబాలను ఆదుకోవాలని సిపిఐ విజ్ఞప్తి చేసింది.గురువారం ఈతకు వెళ్లి మృతి చెందిన లోక్ష్, హరీష్, గణేష్ మృతదేహాలను సిపిఐ నాయకులు భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, ఎస్‌కె.జానిమియా, ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి మృతుల కుటుంబాలను ఓదార్చారు.లోకేష్, హరీష్‌ల తల్లిదండ్రులు ఆముదాల చిరంజీవి, లక్ష్మి సిపిఐ నేతలను చూసి బోరున విలపించారు. చిరంజీవి ఆటోడ్రైవర్లుగా ఏఐటియుసిలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ చిరంజీవి కుటుంబం రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబమని అలాగే గణేష్ తల్లి బానోత్ కళావతి భర్త మృతి చెందిన కాయకష్టం చేస్తూ కుమారున్ని చదివించుకుంటుందని అతనిపై ఆశలు పెంచుకుందని ఈ రెండు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఒక్కొక్కరికి రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకునేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలు, బంధువుల రోదనలతో ఆసుపత్రి మారుమోగింది.

# గ్రామాల్లో ఎన్నికల మైక్‌ల హోరు

**(మొదటి పేజీ తరువాయి..)**

వినోద్‌రావు, ఎంపి అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.పై మూడు ప్రధాన పార్టీల నుండి పోటీ చేస్తున్న ముగ్గురు వ్యక్తుల్లో ఒకొక్కరికీ ఒకొక్క ప్రత్యేకత నెలకొంది. వీరంతా ప్రచార సభలను మైక్‌ల ద్వారా గ్రామాల్లో తీవ్రంగా పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు . కేంద్రంలో బీజేపీ పాలనలో గ్రామాల్లో ప్రజలకు అ ందిస్తున్న సంక్షేమ పథకాలను, రైతులకు అందిస్తున్న రాయితీలను తదితర పథకాలను ఆ పార్టీ మైక్‌ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసింది. అలాగే కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రజలకు అందిస్తున్నా, వివిధ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన ఐదు నెలలో 6 గ్యారెంటీల్లో, ఐదు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేసి ప్రజలకు అందిస్తున్న పథకాలను మైక్‌ల ద్వారా ప్రచారాన్ని ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం రాష్ట్రంలో గత పదేళ్లలో కేసీఆర్ చేసిన రైతు బంధు, రైతు భీమా, కళ్యాణలక్ష్మీ, వృద్ధాప్య పింఛన్లు, తదితర ప్రజా అభివృద్ధి పథకాలను మైక్‌ల ద్వారా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం కొనసాగించారు. ఇలా మూడు ప్రధాన పార్టీలకు చెందిన వారు ఎవరికి వారు విస్తృతంగా మైక్‌ల ద్వారా గ్రామాల్లో ప్రచారాన్ని హోరెత్తించారు.

**మూడు పార్టీలకు 35 వాహనాలు అనుమతి**

ఈనెల 13న జరగనున్న ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు వారు పోటీ చేసే గుర్తులు వారి ముఖ్య నేతల ప్లెక్సీలతో వాహనాల ద్వారా మైక్‌లతో ప్రచారం చేయడానికి ఎన్నికల అధికారులు సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 35 వాహనాలకు అనుమతులు ఇచ్చి ఉన్నారు. పలు రాజకీయ పార్టీల నుండి వాహనాల ద్వారా మైక్‌లతో ప్రచారానికి అనుమతులు కోసం 44 వాహనాలకు దరఖాస్తులు చేసుకోగా, వీటిలో 9 వాహనాలను రిజెక్ట్ చేయగా, మిగతా 35 వాహనాలకు అనుమతులు ఇచ్చారు వీటిలో కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి 20 వాహనాలకు, స్ట్రీల్ కార్నర్ మీటింగ్‌లకు 2 వాహనాలు, బీఆర్ఎస్ పార్టీ ప్రచారానికి 13 వాహనాలను, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లకు 2 వాహనాలను, బీజేపీ పార్టీ ప్రచారానికి 2 వాహనాలు చొప్పున అనుమతులు ఇచ్చి వున్నారు. గత 10 రోజులుగా నియోజకవర్గ పరిధిరలోని సత్తుపల్లి,వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, మండలాల్లోని పలు గ్రామాల్లో మైక్‌ల ద్వారా వాహనాలతో విస్తృతంగా ప్రచారం కొనసాగింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మైక్‌ల ప్రచారాలు శనివారం సాయంత్రం 5. గంటలలోగా ముగియనున్నాయి. అలాగే వివిధ రాజకీయ పార్టీల నేతలు, రంగంలో ఉన్న అభ్యర్థులు సైతం శనివారం సాయంత్రం 5. గంటల లోగా తమ ప్రచారాలను ముగించాల్సి ఉంది. ఎన్నికలు 13వ తేదీ ఉదయం 6. గంటల నుండి సాయంత్రం 5. గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ సమయాన్ని కేటాయించింది.

# మృతునికి కుటుంబానికి ఆర్థిక సాయం

పినపాక, మే 09, ప్రభాతవార్త



మండల కేంద్రం పినపాక గ్రామానికి చెందిన కలకత్తా రామారావు అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం మరణించారు. దీంతో వైస్ ఎంపిపి కంది సుబ్బారెడ్డి నిరుపేద కుటుంబానికి పార్టీ తరుపున తనవంతుగా బియ్యం, ఆర్థిక సాయం గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, ఆదేశాల మేరకు మండలాధ్యక్షులు గొడిశాల రామనాథం ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి తనవంతు సాయంగా దశదిన కర్మలకు 25 కేజీల బియ్యం, రెండువేల నగదు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటూ వాళ్ల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు పోలెబోయిన శ్రీవాణి, తిరుపతయ్య, సీనియర్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, గొట్టెముక్కల స్వతంత్ర రెడ్డి, గట్ల శ్రీనివాస్‌రెడ్డి, గొగ్గల నాగేశ్వరరావు, బాలసాని రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.



మండల పరిధిలోని సిం గిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోపాల సాయిబు (90) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. యువజన సంఘం నియోజకవర్గ నాయకులు కొర్స ఆనంద్ మాట్లాడుతూ నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు మృతుని కటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శాఖమూడి వెంకటయ్య, కొడాలి కృష్ణ, మధుసూదన్ రెడ్డి, గుంటుపల్లి భిక్షపతి, బొడ్డ మంగయ్య, కృష్ణర్జునరావు, ముత్యపు రావు తదితరులు పాల్గొన్నారు.

# చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఎన్నికల అధికారి

పినపాక, మే 09, ప్రభాతవార్త

మండల పరిధిలోని ఇ.బయ్యారం క్రాస్ రోడ్డులో పార్లమెంట్ ఎన్నికల నిబంధనలో భాగంగా అధికారులు ఏర్పాటు చేసిన చెక్ పోస్టును మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రామ్‌కుమార్ గోపాల్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చెక్‌పోస్టువద్ద విధులు నిర్వహిస్తున్న లక్ష్మణరావును వాహన తనిఖీ రికార్డు వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహన తనిఖీలకు సంబంధించిన రికార్డు పక్బందీగా నిర్వహించాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, నగదు తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ పోలీసు కెప్టెన్ నాగార్జున సిబ్బంది పాల్గొన్నారు.



## టిడిపి నాయకుడు రావుట్లకు సన్మానం



<u>*బోనకల్, మే 09 ప్రభాతవార్త*</u>

ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు సందర్భంగా వైరా మండల ఉప్పల మడక గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర నాయకులు పారుపల్లి సురేష్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పారుపల్లి సుబ్బయ్య, తులిశమ్మ మెమోరియల్ ట్రస్ట్, ఎన్టీఆర్ ట్రస్ట్ల తరుపున రెండు తెలుగు రాష్ట్రాల్లోని తెలుగు దేశంలో పార్టీలో సుదీర్ఘకాలం పని చేసిన సీనియర్ నాయకులను సన్మానిస్తున్న సందర్భంగా గురువారం బోనకల్‌కు చెందిన తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, పద్మావతి దంపతులను శాలువాతో సన్మానించి మెమోంటో అందజేశారు. ఈ సందర్భంగా పారుపల్లి సురేష్ మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ స్థాపించిన నాటినుంచి పార్టీలో పని చేస్తూ పార్టీ అభివృద్ధికి రావుట్ల సత్యనారాయణ ఎంతో కృషి చేశారని, ఈ రోజు తమ ట్రస్టు తరుపున వారిని సన్మానించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వారికి భవిష్యత్తులో మరెన్నో పదవులు రావాలని, వారు పార్టీకి మరింత సేవ చేయాలని కోరారు.

## మున్సిపల్ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక




<u>*ఇల్లందు,అర్బన్,మే, ప్రబాతవార్త9:*</u>

మున్సిపాల్టీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో ఇఫ్టూ అనుబంధ కార్మిక నూతన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఇఫ్టూ జిల్లా నాయకుడుమల్లెల వెంకటేశ్వర్లు తెలిపారు. సంఘం అధ్యక్షుడిగాదుర్గా మహేష్,ఉపాధ్యాక్షుడిగ రాపర్తి రాజు,కార్యదర్శిగా కశబోయిన సదా,సహాయ కార్యదర్శిగా ప్రశాంత్, కోశాధికారిగా రాకేష్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకునట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో యాకుబ్‌షావళి, వీరన్న,రాజేష్, సంజీవ్, నందు,శామ్ పాల్గొన్నారు.

## ఘనంగా సునీతరావు జన్మదిన వేడుకలు



<u>*ఇల్లందు, అర్బన్,మే, ప్రభాతవార్త:9*</u>

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావుల జన్మదిన వేడుకలను గురువారం రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి గోచికొండ శ్రీదేవి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ భవిష్యత్తులో మరిన్ని పథకాలు అమలు చేయన్నుట్లు తెలిపారు.

## సమాచారం తెలిపి సహకరించండి :ఏఈ

<u>*కామేపల్లి, మే 9 ప్రభాతవార్త:*</u>

కామేపల్లి మండలంలో భారీ వర్షాలు, ఈదురు గాలులకు ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిన, స్తంభాలు విరిగిన వెంటనే సమీప సబ్ స్టేషన్ కు లేదా టోల్ ఫ్రీ నెంబర్ కు ప్రజలు సమాచారం తెలియజేసి సహకరించాలని కొత్తలింగాల విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ఎన్.శ్రీనివాసులు గురువారం కోరారు.కామేల్లి 9492462242 ,కొత్తలింగాల 94910 75319,ముచ్చెర్ల 7382633843, పొన్నెకల్ 8332989180, టోల్ ఫ్రీ 18004250028, 1912, 9440811525లకు తెలియజేయాలని ఆయనకోరారు.

## ప్రారంభమైన సాయినాధుని వార్షికోత్సవాలు



<u>*కారేపల్లి, మే 9, ప్రభాతవార్త :*</u>

కారేపల్లి బీసీకాలనీలో గల సాయిబాబా ఆలయంలో సాయినాథ స్వామి వారి 25వ వార్షికోత్స వాలు సాయిబాబా భక్త మండలి ఆధ్వర్యంలో నేటి నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. వేద పండితులు నాగసాయి శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు జరిగే ఈ వార్షికోత్స వాల మొదటి రోజైన శుక్రవారం మంగళ తోరణం కట్టుట, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, దీక్షాధారణ, ఋత్విక్ వరణ, పంచగవ్యప్రాసన, మృత్స oగ్రహణం, అంకురారోపణ, అఖండ దీపస్థాపన వంటి కార్యక్రమాలతో వార్షికోత్స వాలు ప్రారంభం కానున్నాయి. తమ గోత్రనామాలతో ఈ వార్షికోత్స వంలో పూజలు చేయించుకోదలచిన భక్తులు రూ.116 తో తమ పేరును, కుటుంబ సభ్యుల పేర్లతో నాగ సాయి శర్మను సంప్రదించాలన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారి తీర్థ ప్రసాధములు స్వీకరించి, ఆ సాచినాధుని కృపకు పాత్రులు కావలసిందిగా భక్త మండలి సభ్యులు కోరారు.

## సోనీ కుటుంబానికి బియ్యం అందజేత

<u>*కామేపల్లి, మే 9 ప్రభాతవార్త:*</u>

గోపాలపురం లో ఇటీవల మృతి చెందిన అజ్మీరా సోని కుటుంబాన్ని లింగాల ఎంపీటీసీ సభ్యులు రామ్‌రెడ్డి జగన్నాథ్ రెడ్డి గురువారం పరామర్శించారు.ఆమె మృతి పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు.బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు.ఈ కార్యక్రమంలో సుమన్, మాజీ సర్పంచ్‌లు అజ్మీర అర్జున్, అజ్మీర రాందాస్,మాజీ ఉపసర్పంచ్ రాయల లక్ష్మయ్య, కొర్ర రాములు,భూక్య రమణ, ఏర్పుల శాంతయ్య, అజ్మీర సుశీల దేవి, భూక్య సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

<u>*కామేపల్లి, మే 9 ప్రభాతవార్త:*</u>

హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేష్ రెడ్డి కి ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ స్టేట్ ట్రైబల్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ ఈరు నాయక్ గురువారం కోరారు.ఏజెన్సీ ప్రాంతంలో జీవోఎంఎస్ నెంబర్ 3 ద్వారా స్థానిక గిరిజనులకు పదోన్నతులు, నియామకాలు కల్పించాలని, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ పోస్టులు కల్పించాలని, జీవో 317 ద్వారా ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విన్నవించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కిషన్ రాథోడ్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పాపాలాల్, బాసు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర్లు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

<u>*కామేపల్లి, మే 9 ప్రభాతవార్త:*</u>

కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో వరి కోలు వెంకటేశ్వర్లు అకాల మరణం చెందడంతో వారి కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ కమిటీ పక్షాన రూ.5000 ఆర్థిక సహాయంను గురువారం అందజేశారు.నాయకులు వట్టి శ్రీనివాస్, రెడబోతు సత్తిరెడ్డి, నలబోలు వెంకట్ రెడ్డి, రెడబోతు వెంకట్ రెడ్డి, పడిగా వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.

## వైద్యశాలను సందర్శించిన డబ్ల్యూహెచ్ ఓ బృందం



<u>*కామేపల్లి, మే 9 ప్రభాతవార్త:*</u>

కామేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను డబ్ల్యూహెచ్ ఓ బృందం గురువారం .కన్సల్టెంట్ డాక్టర్ శిరీష, పీఎంఓ బోజ్యా, ఏఎంఓ వెంకట్రావు, హెచ్ఈఓ వెంకట్ రెడ్డి సందర్శించారు. ఫైలేరియా కేసుల వివరాలను డాక్టర్ చందన ను అడిగి తెలుసుకున్నారు.వైద్యశాలకు వచ్చిన ఫైలేరియా బాధితులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించి చైతన్య పరిచారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ నెల్లూరి చందన, డిపిఎంవో బి.కృష్ణ, హెచ్ఈవో బి.దూప్ సింగ్, హెల్త్ సూపర్వైజర్ నరేందర్ నాయక్, హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.




**పాల్వంచ, ములకలపల్లి, లక్ష్మిదేవిపల్లి, చంద్రుగొండ**

## హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం: కొత్వాల





<u>*పాల్వంచ అర్బన్, మే 9 - ప్రభాతవార్త:*</u>

చాలీచాలని జీతభత్యాలతో జీవనం సాగిస్తున్న హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని డీసీఎంఎస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన హమాలీ కార్మికులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం వారికి వర్తక సంఘం భవనంలో కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. నిత్యం కష్టించి పనిచేసే హమాలీలను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని అన్నారు. మీసా లింగయ్య నాయకత్వంలో సుమారు వంద మంది హమాలీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే విధంగా ఇందిరానగర్ కాలనీకి చెందిన కుమ్మరికుంట్ల నాగా ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. 17వ వార్డు కరకవాగులో సూర్యదేవర పుల్లయ్య, గుమ్మల్ల నారాయణ, బలగం నాగేశ్వరరావు, బలగం వెంకటేశ్వర్లు, గుమ్మల్ల శ్రీకాంత్, నవీన్, కొమ్ము ప్రవీణ్‌లు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, జాలె జానకీరెడ్డి, బద్ది కిషోర్, మహిపతి రామలింగం, పెండ్యాల కృష్ణమూర్తి, చింతా నాగరాజు, కొత్తపల్లి సోమయ్యలు పాల్గొన్నారరు.

## పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



<u>*పాల్వంచ రూరల్, మే 9 - ప్రభాతవార్త:*</u>

మండలంలోని కేశవాపురం - జగన్నాథపురం గ్రామంలో వెలిసిన కనకదుర్గ దేవస్థానం పెద్దమ్మతల్లి ఆలయంలో దేవస్థానం ఈవో సుదర్శన్ ఆదేశాల మేరకు గురువారం అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదన తదితర పూజలు జరిగాయి. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన బిజెపి అభ్యర్థి తాండ్ర

<u>*కారేపల్లి, మే 9,, ప్రభాతవార్త :*</u>

సీనియర్ టిడిపి నేత కంచి రమేష్ నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ బిజెపి అభ్యర్థి తాండ్ర వినోద రావు గురువారం పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు కుటుంబ వివరాలు తెలుసుకొని వారికి తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పోలూరి రామారావు వీరన్నూరి కోటా చారి బిజెపి నాయకుల తురక నారాయణ తదితరులు ఉన్నారు.

# ఆగని ఇసుక దందా

**- పాల్వంచ, పరిసర ప్రాంతాల్లో జోరుగా విక్రయాలు**
**- అడ్డుకట్ట వేయని అధికారులు**
**- అధిక ధరలకు విక్రయిస్తున్న దళారులు**



**పాల్వంచ క్రైం, మే 9 - ప్రభాతవార్త:**
ఎలాంటి నిర్మాణ పనులు అయినా సరే ఎక్కువగా వేసవికాలంలోనే జరుగుతుంటాయి. ఎందుకంటే వేసవి కాలంలో వర్షాలు ఎక్కువగా ఉండవు కాబట్టి నిర్మాణ పనులు చెకచెక్మజరుగుతుంటాయి. చలికాలంలో కూడా నిర్మాణ పనులు చేస్తారు కానీ తక్కువే అని చెప్పాలి. అయితే నిర్మాణ పనులకు ఎంతో ముఖ్యమైన ఇసుకకు ఇప్పుడు డిమాండ్ మరింతగా పెరిగింది. గతంలో రూపాయికి వస్తే ఇప్పుడు మూడు రూపాయలు పెట్టినా కూడా ఇసుక దొరకడం లేదని యజమానులు చెప్తున్నారు. అయితే తాత్కాలికంగా ఇసుక కొరతను చూపిస్తు అధికంగా వసూలు చేయడమే ధ్యేయంగా ఇసుకాసరులు అక్రమ సంపాదనకు తెరలేపారని పలువురు చెప్పుకుంటున్నారు. అయితే ఉదయం,రాత్రి అనే తేడా లేకుండా అధికారులు ఎవరు వచ్చినా కానీ తమను అడ్డుకోరనే ధీమాతో యధేచనచగా విక్రయాలు జరుపుతున్నారు. ఎక్కడో మారుమూల గ్రామాల్లో అయితే ఏం కాదులే అనుకోవచ్చు కానీ ఏకంగా పట్టణం నడిబొడ్డున ఇసుకను డంప్ చేస్తూ అనధికార ర్యాంపుల ద్వారా ఇసుకను తోడేస్తున్నారు. ప్రభుత్వం ఇసుక ర్యాంపులను ఏర్పాటు చేయకపోయినా సరే అధికారుల అండదండలతో ఇసుకాసరులు అందరూ కలిసి ర్యాంపులను ఏర్పాటు చేసుకొని మిషన్ల సాయంతో ఇసుకను తోడేసుకుంటున్నారు.

**- పాల్వంచ, పరిసర ప్రాంతాల్లో జోరుగా విక్రయాలు**

పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ పట్టణంతో పాటు పాత పాల్వంచ, నవభారత్, రంగాపురం, తోగ్గూడెం ప్రాంతాల నుంచి ఇసుక యధేచ్చగా తోడేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలా తీసుకొచ్చిన ఇసుకను పట్టణంలోని పలు ప్రాంతాల్లో డంప్ చేసుకొని మంచి డిమాండ్ వచ్చినప్పుడు అమ్మేసుకుంటున్నారు. అయితే ట్రాక్టర్‌కు రూ.5 నుంచి రూ.7 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదేమిటని అడిగితే ఇసుక దొరకడం లేదు... కావాలంటే ఇస్తాం.. లేదంటే చెప్పండి వెళ్లిపోతాం.. మళ్లీ రేపు కావాలంటే ఇక ఎప్పటికీ మీకు ఇసుక లోడ్ ఇవ్వం అని బెదిరించి మరీ ఇసుకను అమ్మేసుకుంటున్నారు. ఇక ప్రజలు చేసేదేమీ లేక, తమ నిర్మాణ పనులు ఆగిపోతాయనే భయంతో వారు చెప్పిన ధరకే కొనుగోలు చేసుకుంటున్నారు. మళ్లీ వర్షాకాలం వస్తే ఇంటి నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ, ప్రహరీగోడ నిర్మాణాలు ఆగిపోతాయేమోనన్న భయంతో ఇసుకను కొనుగోలు చేసుకుంటున్నారని ప్రజలు చెప్తున్నారు.

**- అడ్డుకట్ట వేయని అధికారులు**

ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన డబ్బులు ఇసుకాసరుల జేబుల్లో నిండుతున్నా అధికారులు మాత్రం అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయలేకపోతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎవరైనా అధికారులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటే వేంటనే వారి ఖాతాల్లో డబ్బులు లంచంగా అందించి దర్జాగా బయటికి వచ్చేస్తున్నారు. ఒకసారి లంచానికి అలవాటు పడిన వారు తమ జీతం కంటే ఈ డబ్బులే ఎక్కువ వస్తున్నాయని ఆశపడి ఇసుక ట్రాక్టర్లు తిరిగే రూట్‌లో ఎప్పుడు రైడింగ్‌లు చేయకుండా ఎక్కడో ఒక చోట ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని తమ రికార్డులలో తనిఖీలు, దాడులు నిర్వహించగా ట్రాక్టర్లను పట్టుకున్నట్లు నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



## భద్రాచలంలో మంత్రి తుమ్మల పర్యటన

**భద్రాచలం, ప్రభాతవార్త :**
భద్రాచలం పట్టణంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పర్యటించారు. ముందుగా భద్రాచలం మాజీ శాసనసభ్యుడు పొదెం వీరయ్య నివాస గృహంకు చేరుకున్న మంత్రి తుమ్మల అక్కడ అల్పాహారం ఆరగించారు. అనంతరం కే.కే ఫంక్షన్‌లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో పలువురు చేరిక సందర్భంగా జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. తదుపరి వీరభద్ర ఫంక్షన్‌హాల్‌లో సీపీయం పార్టీ నిర్వహించిన సభలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. అనంతరం రామాలయం కాటేజీకు చేరుకుని ఆలయ అభివృద్ధికి సంబంధించిన విషయాలను సేకరించారు. ఆలయ ప్రగతికి కోసం నివేదిక సిద్ధం చేస్సుకోవాలని దేవస్థాన అధికారులకు మంత్రి తుమ్మల సూచించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ శాసనసభ్యుడు పొదెం వీరయ్య, భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్య సేవలో ఎన్నికల అబ్జర్వర్‌లు

**భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :**



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని ఎలక్షన్ అబ్జర్వర్‌లు రచిత్‌రాజ్ ఐపీఎస్, ధ్రుపాటి ఉమాకాంత్ ఒడిస్సా ఐఆర్ఎస్‌లు దర్శించుకున్నారు. ముందుగా వీరికి జనరల్ అబ్జర్వర్ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పినపాక ఏఆర్ఓ ప్రతీక్ జైన్ ఘనస్వాగతం పలికారు. అదేవిధ:గా దేవస్థానం ఆవరణం వద్దకు చేరుకున్న అబ్జర్వర్‌లకు దేవస్థాన అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ముందుగా బలిపీఠంను దర్శించుకుని శ్రీస్వామి అంతరాలయం చుట్టూ ప్రదక్షణ గావించారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ప్రాశస్త్యాన్ని వివరించారు. అంతరాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఆవరణంలోని శ్రీలక్ష్మీతాయారమ్మ వారి సన్నిధిలో వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు. అధికారులు శ్రీస్వామి వారి లడ్డూ ప్రసాదం, కళ్యాణ అక్షింతలు, స్వామి వారి పట్టువస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, మణుగూరు తహసిల్దార్ రాఘవరెడ్డి, దేవస్థానం పర్యవేక్షకుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా రామయ్య కళ్యాణం

**భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :**



భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారి కళ్యాణం వైభవోపేతంగా సాగింది. ఉదయమే పవిత్ర గోదావరి నదీ తీరం నుండి తీర్ధపు బిందెలో మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు నడుమ నదీ జలాలను తీసుకుని శ్రీస్వామి వారి మూలవరులకు, ఉత్సవమూర్తులకు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీలో భక్తుల జయ జయ ధ్వానాల నడుమ శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులను బేడా మండపానికి తీసుకుని వచ్చి ఆశీనులను చేశారు. అర్చకస్వాములు ముందుగా శ్రీస్వామి వారి సహస్ర నామార్చన, తదుపరి క్షేత్ర మహాత్యాన్ని భక్తులకు వివరించారు. కళ్యాణతంతులో భాగంగా శ్రీస్వామి వారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచన, శ్రీస్వామి వారి, అమ్మవార్ల ప్రవరలు, యోత్రధారణ, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, మహాసంకల్పం, మంగళాష్టకాలు, చూర్ణిత, సుముహూర్తం, మాంగళ్యపూజ, మాంగళ్యధారణ, అక్షతారోపణ, వేదాశీర్వచనం, మంగళాశాసనంతో కళ్యాణతంతు ముగిసింది. కళ్యాణం జరుగుతున్నంత సేపు కళ్యాణంలో పాల్గొన్న దంపతులు కన్నులారా శ్రీసీతారామచంద్రస్వామి వార్లను చూస్తూ తరించిపోయారు. వేదపండితుల మంత్రోచ్చరణలకు తన్మయత్వంతో పులకరించిపోయారు. అనంతరం కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు దేవస్థాన సిబ్బంది కళ్యాణలడ్డూ, శ్రీస్వామి వారి వస్త్రాలు, అక్షతలు పంపిణీ చేశారు.



## ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు

**-భద్రాచలం స్పెషల్ సబ్‌జైలు సూపరింటెండెంట్ ఉపేందర్**

**దుమ్ముగూడెం, ప్రభాతవార్త :**
విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుందని భద్రాచలం ప్రత్యేక సబ్‌జైలు సూపరింటెండెంట్ ఉపేందర్ అన్నారు. దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరంలో ఉన్న మడోన్న ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుల అభినందన సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా సబ్ జైలు సూపరింటెండెంట్ ఉపేందర్ పాల్గొని మాట్లాడుతూ.. మడోన్న పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఇటీవల జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులై సీట్లు సంపాదించడం ఆనందించదగ్గ విషయమని, ఇందుకు ప్రధాన కారణం పాఠశాలలోని ఉపాధ్యాయుల కృషి, సేవలు మరువలేనివని విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు ఎన్.రూపారాణి, పలువురు ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు గోర్సా కామరాజును శాలువాతో సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఉపాధ్యాయులు మంగపతి, శశిరేఖ, జయమ్మ, హారిక, పావని పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులలో పనిచేసే బృందాలు పకడ్బందీగా పనిచేయాలి

**-ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి**
**-పోలింగ్ కేంద్ర్రాల్లో మౌళిక వసతులు ఏర్పాటు చేయాలి**
**-ఎన్నికల అబ్జర్వర్ రచిత్‌రాజ్**

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త :**
పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సరిహద్దులలో ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్టులలో పనిచేసే బృందాలు చాలా పకడ్భందీగా ఉండి ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసిన డబ్బు, మద్యం, గంజాయి లాంటి వస్తువులు సరఫరా అయ్యే అవకాశం ఉంటుందని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రచిత్‌రాజ్ అన్నారు. గురువారం మొరంపల్లిబంజరలోని అంతరాష్ట్ర చెక్‌పోస్టును ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్‌తో కలిసి ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. అకౌంటింగ్ బృందాలు, వీడియో సర్వేయింగ్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని అన్నారు. ఎన్నికల తేదీ దగ్గర పడుతున్నందున ఎంపీ బరిలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బు, మద్యం రవాణా చేసే అవకాశం ఉన్నందున, మోటార్ సైకిల్ మొదలుకుని పెద్ద వాహనాల వరకు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అన్నారు.



తనిఖీల్లో పట్టుబడ్డ డబ్బు, ఇతర వస్తువులు ప్రతీది రికార్డుల్లో పొందుపరచాలని, ప్రతీది వీడియో కవరేజ్ చేయాలని అన్నారు. అనంతరం సారపాకలోని బీపీఎల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరు పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించి ప్రతి పోలింగ్ స్టేషన్‌లో తప్పనిసరిగా కరెంటు, మంచినీటి సౌకర్యం, మెడికల్ క్యాంపులు, పోలింగ్ సిబ్బందికి ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, అలాగే పోలీస్ స్టేషన్‌ల ముందు ఓటర్లు బారులు తీరి ఉన్నప్పుడు వారికి ఎండలు తగలకుండా షామియానాలు ఏర్పాటు చేయాలని, మంచినీరు మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేయాలని అందుకు సిబ్బందిని ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, బూర్గంపహాడ్ తహసిల్దార్ ముజాహిద్, మణుగూరు తహసిల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీవో జమలారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల విధులపై హైపవర్ ప్రజెంటేషన్

**పారదర్శకంగా డిస్ట్రిబ్యూషన్,రిసెప్షన్ బృందాలు పనిచేయాలి**

**జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు శ్రీరామ్**



**ఖమ్మం, మే 9, ప్రభాతవార్త:**

ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పారదర్శకంగా సజావుగా జరిగేలా, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల బృందాలు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు, జిల్లా ఉపాధికల్పన అధికారి కె.శ్రీరామ్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గురువారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిస్ట్రిబ్యూషన్,రిసెప్షన్ బృందాల అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు, పరిశీలించాల్సిన విషయాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి నిర్వర్తించాల్సిన విధులు, డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్లలో చేయాల్సిన ఏర్పాట్లపై వివరించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు మాట్లాడుతూ గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ ప్రక్రియ సాఫీగా జరిగేలా చూసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ టీంలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రి సైడింగ్ అధికారులకు అందించాల్సిన పోలింగ్ మెటిరియల్ బ్యాగ్‌ను చెక్ లిస్ట్‌తో సహా ముందుగా సిద్దం చేసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల సిబ్బందికి కౌంటర్లు ఏ విధంగా ఉండాలన్న దానిపై పూర్తి అవగాహన కల్పించారు. అయా అధికారులు ఇచ్చిన సూచనలు విధిగా పాటించాలని స్పష్టం చేశారు. రిసెప్షన్ కౌంటర్ ఇంచార్జి మెటీరియల్, డాక్యుమెంట్స్‌కు సంబంధించిన అన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సెక్టార్ వారిగా ఈవిఎం, పోల్ మెటిరియల్ పంపిణీ చేయాలని, రిసెప్షన్ సెంటర్లలో కౌంటర్ వారీగా



తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ టీంలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ నోడల్ అధికారి జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, సహాయ జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు మదన్‌గోపాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




ఖమ్మం, కార్పొరేషన్, రఘునాధపాలెం, కల్చరల్, ఖమ్మం రూరల్

## ఐవిఓ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎస్ఎం అరుణ్

**ఖమ్మం కల్చరల్, మే 8, ప్రభాతవార్త:**




మాజీ సైనికోద్యోగుల ఇండియన్ వెటర్న్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఖమ్మానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి, అంతర్జాతీయ ఆంగ్ల నిపుణులు ఎస్ఎం అరుణ్‌ను గురువారం నియమించారు. ఐవిఓ రాష్ట్ర అద్యక్షులు ఉజ్జీవిని రవీందర్, స్టేట్ కో ఆర్డినేటర్ గుండా మధుసూదన్‌లు నియామక పత్రాలను ఎస్ఎం అరుణ్‌కు అందించారు. మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తూ సమాజ సేవలో నిరంతరం బాధ్యతలు నిర్వహిస్తున్న అరుణ్ నియామకం పట్ల ఖమ్మం జిల్లా మాజీ సైనికు ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతరావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, ఎన్సిసి విద్యార్థి సాహితీలు ఎస్ఎం అరుణ్‌కు అభినందనలు తెలిపారు.

# గరిమెళ్లపాడును సందర్శించిన అధికారులు





**- అధికారుల రాకతో ఓటు వేస్తామన్న గిరిజనులు**

**- ఓటు హక్కుపై అవగాహన...**

**రుద్రంపూర్, మే 9 - ప్రభాతవార్త:**

ఆదివాసీ గిరిజనులమైన తమ సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కరించడం లేదని, తమకు ఉపాధి కల్పించడం లేదని ఓట్లను బహిష్కరిస్తామని బ్యానర్లు కట్టారు. గరిమెళ్లపాడు ఆదివాసీ గిరిజన ప్రాంతానికి అధికారులు రావడంతో వారికి తమ గోడు విన్నవించుకున్న అనంతరం ఓటు వేస్తామని గిరిజనులు తెలిపారు. ఆదివాసీ గిరిజన సమస్య అధికారులకు తెలియజేసేందుకు



ఓటును బహిష్కరిస్తున్నామని బ్యానర్లు కట్టామన్నారు. అంతే తప్ప రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును తాము కాదనడం లేదని అన్నారు. ముందుగా సమస్యలు అధికారులకు తెలియజేశారు. అనంతరం గిరిజనులకు అర్థమయ్యే విధంగా కొత్తగూడెం డీఎస్పీ ఆర్డీవో, సీఐ, తహసీల్దార్, ఎంపీడీవోలు మాట్లాడారు. దీంతో గిరిజనులు ఈసారైనా తమకు న్యాయం జరిగే విధంగా చూడాలని అధికారులను కోరారు. గరిమెళ్లపాడు నర్సరీలో ఉపాధి కల్పించాలని ఐటీడీఏలో ఉన్న భూములు తమ తాత తండ్రులవని, భూమిలేకపోయినా కనీసం ఉపాధి దొరికితే చాలని అన్నారు. గతంలో మేము చేసిన ఉపాధి హామీ పనులకు సంబంధించి తమకు రావాల్సిన బకాయిలను గతంలో ఉన్న ఐటీడీఏ పీవో దివ్య అప్పటి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు నివేదికలు ఇచ్చినరా కానీ తమకు రావాల్సిన కోట్ల రూపాయల కూలీ డబ్బుల బకాయిలను ఇప్పించే నాయకుడు కానీ అధికారులు కానీ లేరని అన్నారు. ఐటీడీఏ నర్సరీలో గిరిజనులకు మాత్రమే టెండర్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పుడు నాన్ ట్రైబ్ ఇచ్చిన టెండర్లను రద్దు చేయాలని, ఆ టెండర్లు తమకు ఇస్తే గిరిజనులందరూ కలిసి ఉపాధిని పొందుతామని అన్నారు. వంద రోజుల ఉపాధి హామీ పథకం తమ కడుపును నింపడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. నర్సరీ పనులు మాత్రమే చేసే తాము కడియంకు వలస పోకుండా ఇక్కడే ఉపాధిని కల్పించాలని కోరారు. హామీలకు ఇది సమయం కాదని, ప్రస్తుతం జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరారు. మీకు నచ్చిన వారికి ఓటును వినియోగించుకోవాలని, లేదుమీకు నచ్చకుంటే నోటాను ఉపయోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఎలక్షన్ల అనంతరం మీ సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళితే పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని అన్నారరు. దీంతో ఓట్ల బహిష్కరణకు గిరిజనులు వెనక్కి తీసుకున్నారు. ఓట్లు వేస్తామిన అధికారులకు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు గరిమెళ్లపాడు గిరిజనుల సమస్యలపై రానున్న రోజుల్లో ఏ మేరకు పరిష్కార మార్గాలు చూపుతారో వేచి చూడాల్సిందే.

## కుండపోత వర్షం

**- లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన వరదనీరు**

**- పొంగి ప్రవహించిన డ్రైనేజీలు**

**- బస్టాండ్ ఆవరణలో నిలిచిన వర్షపునీరు**

**- పూర్తిగా చల్లబడ్డ వాతావరణం**

**పాల్వంచ, మే 9 - ప్రభాతవార్త:**





"ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది... అప్పటి వరకు ఎండ వేడిమి... వెనువెంటనే వాతావరణం చల్లబడటం... ఆ ఏదో గాలి దుమా రం వస్తుందిలే... చినుకులు పడి పోతుందిలే అనుకుంటే... ఏకంగా కుండపోతగా వర్షం కురిసింది... వేసవి కాలంలో ఇంతపెద్ద వర్షం కురవ డం ఇదే తొలిసారి... పాల్వంచ పట్టణ వాసులు అందరూ ఒక్కసారిగా షాక్ అయ్యారు... అసలు ఏం జరుగుతుందో తేరి చూసే సరికి పట్టణం అంతా అతలాకుతలం అయిపోయింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులపైకి వరద నీరు చేరింది. బస్టాండ్ ఆవరణ అంతా నిండిపోయింది. పాల్వంచ శివనగర్‌లో రోడ్డుపైకి వరదనీరు ప్రవహించడంతో ప్రజలు షాక్ అయ్యారు... వేసవి కాలంలో ఇంతలా వర్షం కురవడం ఇదే తొలిసారి అంటూ చెప్పున్నారు. పాల్వంచ పట్టణంలో గురువారం కుండపోత వర్షం కురిసింది. బస్టాండ్, జాతీయ రహదారి, బొల్లోరిగూడెం, ఒడ్డుగూడెం, కాలనీ, జయమ్మకాలనీ, వికలాంగుల కాలనీల్లోకి భారీగా వరదనీరు చేరింది. డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. భారీవర్షం కురవడంతో వాతావరణం అంతా చల్లబడింది. వేసవి ఎండలకు తల్లడిల్లిన ప్రజలకు ఈ వర్షం చాలా వరకు ఊరటనిచ్చిందని చెప్పవచ్చు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- పోలింగ్ కేంద్రాల వద్ద ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నధికారులకు సమాచారం అందించాలి: ఎస్పీ రోహిత్‌రాజు






**కొత్తగూడెం క్రైం, మే 9 - ప్రభాతవార్త:**
ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీసు అధికారులు, సిబ్బంది పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా బాధ్యతగా వ్యవహరించాలని, పోలింగ్ కేంద్రల వద్ద ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే తమ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల నేపద్యంలో ఈవీఎంల తరలింపు, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అన్నారు. పోలింగ్ విధుల పట్ల అధికారులకు, సిబ్బందికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనరిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా ప్రవర్తించే వ్యక్తులను అదుపులోకి తీసుకొని ఎన్నికల నియమావళి ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే అధికారులు చుట్టూ ఉన్న పరిసరాలను ఎప్పటికప్పుడు గమనిసూనత ఉండాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తనవంతు కృషి చేయాలని అన్నారు. రౌడీ షీటర్లు, సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకొని ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ సాయిమనోహర్, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్‌సింగ్, డీఎస్పీలు రెహమాన్, చంద్రభాను, సతీష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలతో పాటు రూట్ మొబైల్ ఇంచార్జి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌పీఎఫ్ ఉద్యోగులు టికెట్ వినియోగదారులకు వేధింపులు

**కొత్తగూడెం అర్బన్, మే 9 - ప్రభాతవార్త:**



కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ సమీపంలో ద్విచక్రవాహనం పార్కింగ్ చేసిన నెపంతో వినియోగదారుల వాహనాలకు తాళాలు వేసి 500 రూపాయలుజరిమానా వసూలు చేస్తున్నారు. రైల్వే స్టేషన్ ఆధునీకరణ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. టికెట్ రిజర్వేషన్ కోసం వచ్చిన వినియోగదారులు ఆ సమీపంలో బైక్‌లు ఉంచి టికెట్ రిజర్వేషన్ కౌంటర్‌కు వెళ్లి వచ్చే లోపు వెహికిల్‌కు తాళాలు వేసేస్తున్నారని, ఆ తర్వాత వినియోగదారుల నుంచి రూ.500 జరిమానా నెపంతో వసూలు చేస్తున్నారని అన్నారరు. ఇంత డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారని అడిగితే పార్కింగ్ చార్జెస్ తీసుకుంటున్నామని చెప్తున్నారని, దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రశీదు అడిగితే ఖాజీపేటకు వచ్చి తీసుకోవాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. దీనిపై రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీకేఎంఎస్ బీఎంఎస్ కార్యదర్శి మాధవ్‌నాయక్ డిమాండ్ చేశారు.

## వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరికలు



**- లక్ష్మీదేవిపల్లి, మే 9 - ప్రభాతవార్త:**
వివిధ పార్టీలకు చెందిన అనేక మంది ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి మంత్రి పొంగులేటి సమక్షంలో గురువారం చేరారు. ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలం జెడ్పీటీసీ మేరెడ్డి వసంత, ప్రశాంతినగర్ ఎంపీటీసీ ముక్కెర శిరీషతో పాటు తాజామాజీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, మైనార్టీ నాయకులు, సీనియర్ పార్టీ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి మంత్రి పొంగులేటి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామరెడ్డి



**లక్ష్మీదేవిపల్లి, మే 9 - ప్రభాతవార్త:**
బాలబాలికలు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామరెడ్డి అన్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న తైక్వాండో వేసవి శిక్షణా శిబిరాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ శిభిరంలో కొత్తగూడెం పలు ప్రాంతాల నుంచి 50 మంది బాలబాలికలు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బాలబాలికలు పాటశాలలకు వేసవి సెలవులు ఉన్నందున ఈ వేసవి శిక్షణా శిబిరాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని అన్నారు. ప్రతీ ఒక్కరూ చదువుతో పాటు క్రీడల పట్ల ఆసకినత కనపర్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారులుగా ఎదగాలని అన్నారు. బాలబాలికల తైక్వాండో ప్రదర్శనను ఆయన తిలకించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, శిక్షణా శిబిరం ఇంచార్జి మొగిలి మాట్లాడుతూ... ఈ శిక్షణ శిబిరం నెల రోజుల పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో కొనసాగుతుందని, శిక్షణ పూర్తి అయిన తర్వాత ప్రతిభ కనపర్చిన వారికి సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని అన్నారు. కోచ్ నరేష్, ప్రధాన కార్యదర్శి కాశీహుస్సేన్, ప్రసాద్, ఆదినారాయణ, సుదర్శన్, బెజ్జంకి సత్తి తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపడి 16 గొర్రెలు మృతి

**పాల్వంచ క్రైం, మే 9 - ప్రభాతవార్త:**
పాల్వంచ మండలంలో గురువారం సాయంత్రం అతిభారీ వర్షం కురిసింది. సోములగూడెం సమీపంలో పిడుగుపడటంతో వేల్పుల రాజు అనే వ్యక్తికి చెందిన 16 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వీటి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుంది. ఉదయం కొద్దిసేపు ఎండ, కొద్దిసేపు మబ్బు పట్టి ఉండటంతో గొర్రెలను మేతకోసం తీసుకెళ్లానని, సాయంత్రం సమయంలో అతిభారీ వర్షం కురవడంతో పక్కన చెట్టు వద్ద వాటిని ఉంచానని, అంతలో పిడుగు పడటంతో అన్ని మేకలు అక్కడికక్కడే మృతి చెందాయని సదరు యజమానుడు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు. తన జీవనాధారమైన గొర్రెలు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.




చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్

## కూనంనేని సమక్షంలో 130 కుటుంబాలు సీపీఐలో చేరిక



**కొత్తగూడెం, మే 9 - ప్రభాతవార్త:**
ప్రజాక్షేత్రంలో ఉండే పార్టీ సీపీఐనే అని, పార్టీ శ్రేణులు అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ పంచాయతీకి చెందిన లగడపాటి రమేష్‌చంద్, తేలిక పుల్లయ్య, గంపల రవీందర్, సుజాతనగర్ మండలం కోమటిపల్లి పంచాయతీకి చెందిన మూడ్ భీమ్లా, కొర్రా శ్రీను, బాబూలాల్, కొత్తగూడెం మున్సిపాలిటీ 28,30 వార్డులకు చెందిన దాసరి శ్రీరను, జే.శ్రీనివాస్, తాడూరి రుక్మిణి, కోరి దేవి, సాగరపు వెంకటలక్ష్మి నేతృత్వంలో మూడు ప్రాంతాలకు చెందిన 130 కుటుంబాలు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాల సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజాక్షేత్రంలో ఉంటూ సేవలందించే పార్టీలనే ప్రజలు ఆదరిస్తారని, సీపీఐ సేవలను గుర్తించి ఇటీవల వందలాది మంది వివిధ పార్టీల నుంచి సీపీఐలో చేరారని, వారి నమ్మకానికి అనుగుణంగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ఏకైక ఎజెండా అని, అందుకోసం ఎలాంటి త్యాగానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, జక్కుల రాములు, పిడుగు శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, పల్లపోతు సాయికుమార్, తాళ్ల వెంకటేశ్వరరావు, యూసఫ్, బానోత్ గోవిందు, బత్తుల సురేష్, నేరెళ్ల రమేష్, రత్నకుమారి, భూక్యా శ్రీను, మంగియా పాల్గొన్నారు.

## అథ్లెటిక్ వేసవి శిక్షణా శిబిరాన్ని పరిశీలించిన జిల్లా క్రీడల అధికారి



**రుద్రంపూర్, మే 9 - ప్రభాతవార్త:**
జిల్లాయువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో రుద్రంపూర్ ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ వేసవి శిక్షణా శిబిరాన్ని గురువారం జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. కార్మిక ప్రాంతమైన రుద్రంపూర్‌లో ఈ క్యాంపును అందరూ ఉపయోగించుకొని అథ్లెటిక్స్‌లో పతకాలు గెలుపొందాలని కోరారు. ఈ సందర్భంగా కోచ్ నాగేందర్‌కు కొన్ని సూచనలు చేస్తూ క్యాంపు నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యమ్రంలో జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సెక్రటరీ గుమ్మడి భరత్, క్రికెట్ కోచ్ మహేష్‌లు పాల్గొన్నారు.






# అతిథి అధ్యాపకుల బోధనతీరు పరిశీలన

**-ఐటిడిఏ పీవో ప్రతీక్‌జైన్**

*భద్రాచలం ప్రభాతవార్త:*



భద్రాచలంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న డీఈడీ కాలేజీలో గెస్ట్, కాంట్రాక్ట్ లెక్చరర్లను అకాడమిక్ ఇయర్ వారి యొక్క బోధనతీరును వారిని కొనసాగించడానికి డెమో ద్వారా వారి యొక్క బోధనను పరిశీలించడం జరిగిందని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాలులో డీఈడీ కళాశాలలో పనిచేయుచున్న గెస్ట్, కాంట్రాక్ట్ లెక్చరర్ల డెమోను కమిటీ సభ్యుల సమక్షంలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడు గిరిజన విద్యార్థులకు మంచి బోధనా పద్ధతిని ఎంపిక చేసుకొని వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, అందుకు ప్రతి ఉపాధ్యాయుడు నిష్ణాతుడై ఉండాలని అన్నారు. ప్రతి విద్యార్థికి మన్నికైన విద్య అభ్యాసన సామర్థ్యాలు, ప్రతి అంశం విద్యార్థులకు బోధిస్తే అన్ని సబ్జెక్టులలో విద్యార్థులు చక్కగా అర్థం చేసుకొని పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవుతారని ఆయన అన్నారు. డీఈడీ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం లెక్చరర్లు విద్యార్థులకు వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన ఏ విధంగా విద్యార్థులకు బోధిస్తున్నది పరిశీలించడానికి సబ్జెక్టుల వారిగా ఒక్కొక్కరిని పిలిచి వారి యొక్క డెమోను పరిశీలించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, డీఈవో వెంకటేశ్వర చారి, ఏఎంఓ నాగరాజు శేఖర్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వీరు నాయక్, డీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ భవాని, ఏసీఎంఓ రమణయ్య, ఏటిడబ్ల్యూ నరసింహారావు, లెక్చరర్లు పాల్గొన్నారు.

## స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

**-దుమ్ముగూడెం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఫ్లాగ్‌మార్చ్**

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*




వచ్చే పార్లమెంట్ ఎన్నికలు సురక్షితమైన స్వేచ్ఛాయుత శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సందేశాన్ని తెలుపుతూ దుమ్ముగూడెం సీఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, 141 సీఆర్పీఎఫ్ సిబ్బంది గురువారం లక్ష్మీనగరం గ్రామంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ నెల 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ కలిసి శాంతియుత వాతావరణంలో ఎన్నికల్లో పాల్గొనాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దుమ్ముగూడెం పోలీసు స్టేషన్ నుంచి లక్ష్మీనగరం, ములకపాడు వరకు ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం ఎస్సైలు కేశవరావు, గణేష్, 141 బెటాలియన్ సిఆర్‌పిఎఫ్ సిబ్బంది, దుమ్ముగూడెం పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చర్లలో ఆరోగ్య శిబిరం

*చర్ల, ప్రభాతవార్త :*



చర్లలోని డబుల్‌బెడ్‌రూం ప్రాంతంలో, గంపెనగూడెం గ్రామంలో గురువారం డా.శ్రీధర్ నేతృత్వంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ రెండు క్యాంపులలో 52 మందికి ఆరోగ్య పరీక్షలు చేయగా వారిలో ముగ్గురికి జ్వరం ఉండడంతో వైద్యం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్కే వైద్యాధికారులు డా.శిరీష, డా.శ్యాంప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, లక్ష్మీ, శిరీష, గీత సరస్వతి, స్వరూప, దుర్గా, భారతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాముని సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి విరాళం

*భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :*



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యం లో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి కొత్తగూడెం నియోజకవర్గంలోని చుంచుపల్లి మండలానికి చెందిన గద్దె ప్రమీల రూ.1లక్ష విరాళాన్ని దేవస్థాన సూపరింటెండెంట్ లింగాల సాయిబాబాకు అందజేశారు. గురువారం శ్రీస్వామి వారి దర్శనార్థం విచ్చేసిన వీరు ముందుగా ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన అధికారులు స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించగా .. అర్చకస్వాములు అంతరాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వేదాశీర్వచనం అందజేశారు. సూపరింటెండెంట్ సాయిబాబా శ్రీస్వామి వారి మహాలడ్డూ ప్రసాదం, కళ్యాణ అక్షింతలను అందజేశారు.

## విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలో ప్రవేశం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలి

**-ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రతీక్ జైన్**

*భద్రాచలం ప్రభాతవార్త:*



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరిట్ ప్రకారము కార్పొరేట్ కళాశాలలో ప్రవేశం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం ఐటీడీఏ కాన్ఫరెన్స్ లో భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్, కన్వీనర్ల కమిటీ సభ్యుల సమక్షంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరిట్ ప్రకారము పర్సంటేజ్ వచ్చిన పిల్లలు అప్లై చేసుకోవాలని, మెరిట్ ఆధారంగా ఎంపిక చేసి భద్రాద్రికొత్తగూడెంలోని కృష్ణవేణి కార్పొరేట్ కళాశాలలో, హాస్టల్‌లో వసతితోపాటు, ఉచిత విద్య బోధించడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, డిఆర్‌డిఓ విద్యాచందన, డిఐఓ సులోచన, డిడబ్ల్యూఓ విజేత, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిరా, సాంఘిక సంక్షేమ ఆఫీసర్ అనసూయ, మండల సమాఖ్య వివో ఏ.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించిన తహసీల్దార్

*పినపాక, మే 09, ప్రభాతవార్త*

ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను టి.సూర్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులకు కలగకుండా నీడ కోసం టెంట్లు, మంచినీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా వికలాంగులకు, గర్భిణులకు, మహిళలకు, వృద్ధులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణ, స్థానిక పంచాయతీ కార్యదర్శులు జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.



## విస్తృతంగా పోలీసు తనిఖీలు

*మణుగూరు, ప్రభాతవార్త, మే 9 :*



మణుగూరు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో విస్తృతంగా పోలీసు తనిఖీలు నిర్వహించారు. మణుగూరు డీఎస్పీ వి.రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ ఎస్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రధాన కూడళ్లతో పాటు పట్టణంలోని సురక్షాబస్టాండ్, అంబేద్కర్‌సెంటర్ తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించి అనుమానితులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు మణుగూరులో మంత్రి తుమ్మల పర్యటన

*మణుగూరు, ప్రభాతవార్త, మే 9 :*

నేడు మణుగూరు మండలంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా సాయంత్రం 4గంటలకు మణుగూరు పీవీకాలనీ క్రాస్‌రోడ్డు నుంచి సురక్షా బస్టాండ్ వరకు అక్కడి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించే బైక్‌ర్యాలీలో పాల్గొననున్నారు. అనంతరం మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**- మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే పాయం వినతి**

*మణుగూరు, ప్రభాతవార్త, మే 9 :*

రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఖమ్మంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలిసి పినపాక నియోజకవర్గంలో ఇటీవల కురిసిన అకాలవర్షం వలన తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాలని కోరినట్లు గురువారం తెలిపారు. మంత్రి పొంగులేటి వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌తో ఫోనులో మాట్లాడి పంటనష్టాన్ని అంచనావేసి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలుచేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

## అనారోగ్యంతో వ్యక్తి మృతి

*పినపాక, మే 09, ప్రభాతవార్త*

మండల పరిధిలోని ఏడూళ్ళ బయ్యారం గ్రామ పంచాయతీలో గల బోటిగూడెం గ్రామానికి చెందిన భూమిరెడ్డి గురవారెడ్డి గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని పలువురు పరామర్శించారు.

# ఇసుక ర్యాంపు నిర్వహణలో లోపాలు





**-సీతమ్మసాగర్ డిసిల్టేషన్ పేరుతో ఇసుక అనుమతులు**

**-నిబంధనలకు తిలోధకాలు**

**-పత్తాలేని టీఎస్ఎండీసీ సిబ్బంది**

**-ఇరిగేషన్ భూమిలో డంపింగ్ యార్డ్**

**-కనిపించని సీసీ కెమెరాలు**

**చర్ల, ప్రభాతవార్త :**

సీతమ్మసాగర్ ప్రాజెక్టులో భాగంగా చర్ల మండలంలోని కత్తిగూడెం పంచాయతీ పరిధిలోని జిపిపల్లి గ్రామంలో గిరిపుత్ర సాండ్ క్వారీ మహిళా లేబర్ కాంట్రాక్ట్ మ్యూచువల్ ఎయిడెడ్ కో.ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌తో సర్వే నెంబర్ 24లో రూ.5,53,060 క్యూబిక్ మీటర్ల ఇసుక తీయడానికి అనుమతులు లభించాయి. నేడు గోదావరి నుంచి ఇసుక తోలకాలు ప్రారంభమయ్యాయి. ఇసుక ర్యాంపు నిర్వహణ ఆదిలోనే సంబంధిత నిర్వహణ అంతా లోపబూయిష్టంగా సాగుతుంది. ఇసుక ర్యాంపు నిర్వహణలో అధికారులు సూచించిన నిబంధనలు ఏ మాత్రం పట్టించుకోకుండా ఇసుక తోలకాలు ప్రారంభించారు.

**-పత్తా లేని డీఎస్ఎండీసీ సిబ్బంది**

ఇసుక ర్యాంపు నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాల్సిన సంబంధిత అధికారులు పత్తా లేకుండా పోయారు. ర్యాంపు నిర్వహణలో భాగంగా అధికారులు సూచించిన హద్దులు ఏ మాత్రం అక్కడ కనిపించలేదు. సీసీ కెమెరాల నిఘాలో ర్యాంపు నిర్వహణ సాగాలి. పరిసర ప్రాంతంలో అవి ఏ మాత్రం కనిపించలేదు.

**-అనుమతులు ఒక చోట .. తోలకం మరో చోట**

ఇసుక ర్యాంపు నిర్వహణలో భాగంగా అదికారులు సూచించిన డంప్‌యార్డ్‌లో కాకుండా సీతమ్మసాగర్ అంతర్భాగంలో ఉన్న ఇరిగేషన్ భూమిలో అనధికార డంపింగ్ యార్డ్‌ను తయారు చేసి అక్కడ ఇసుక నిల్వ చేస్తున్నారు. ఇరిగేషన్ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తోలకాలు చేపట్టడం ఆ శాఖ అదికారులు ఘటన ప్రదేశానికి చేరుకుని సంబంధిత రేజింగ్ కాంట్రాక్టర్ మందలించినట్లు సమాచారం. కాగా ఈ విషయంపై ఆ శాఖ అధికారులు విచారణ చేసి కేసు నమోదు చేసే అవకాశం ఉంది. సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు పర్యావరణ అనుమతులు లేవని, కొందరు కోర్టుకు వెళ్ళడంతో అట్టి పనులు సుమారు ఏడాది కాలంగా నిలిచిపోయాయి. ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిచిపోగా ప్రాజెక్టు కింది స్థాయి భాగంలో డిసిల్టేషన్ పేరుతో అనుమతులు ఎలా లభించాయన్న సందేహం వ్యక్తం చేస్తున్నారు.

## మంత్రి తుమ్మల కాన్వాయిని తనిఖీ చేసిన ఎన్నికల అధికారులు



**భద్రాచలం ప్రభాతవార్త:**



రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళి ప్రకారం అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీ బృందాలు ప్రతి వాహనాన్ని తనిఖీ చేయడం జరుగుతుందని భద్రాచలం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దామోదర్ రావు అన్నారు. గురువారం కూనవరం రోడ్డులో గల అంతర్రాష్ణ సరిహద్దు చెక్పోస్ట్‌లో ఎఫ్ఎస్‌టి బృందాలు వాహనాలను తనిఖీలో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాన్వాయ్‌ని ఎఫ్ఎస్‌టి బృందం సభ్యులు తనిఖీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. చెక్పోస్టులలో విధులు నిర్వహిస్తున్న వివిధ బృందాలు ప్రత్యేకమైన నిఘాతో ప్రతి వాహనాన్ని పరిశీలించడం జరుగుతుందని, ఎన్నికల నియమా నిబంధనలను తప్పకుండా పాటించి వారి యొక్క ఉద్యోగ ధర్మాన్ని నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వేల్పుల శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి



**-ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి**

**-ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రచిత్ రాజ్**

**భద్రాచలం ప్రభాతవార్త:**

ఎన్నికల తేదీ దగ్గర పడుచున్నందున సరిహద్దులలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్పోస్టుల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించి ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రచిత్ రాజ్ అన్నారు. గురువారం కూనవరం రోడ్డులో ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టి అంతర్రాష్ట్ర చెక్పోస్ట్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు బహిరంగ సభలు సమావేశాలు రోడ్షోలను తప్పనిసరిగా రికార్డ్ చేసి ఎన్నికల సంఘం సూచన మేరకు రికార్డులలో పొందుపరచాలని, ప్రచార ఖర్చులు, ఇతర ఖర్చులకు సంబంధిత ప్రత్యేక రిజిస్టర్‌ను మెయింటైన్ చేయాలని, అనుమతి తీసుకున్న వాహనాల కంటే ఎక్కువ వాహనాలు ఉన్నట్లయితే వాటిని అనుమతి రద్దు చేయాలని, అన్ని చెక్పోస్ట్‌ల వద్ద నియమించబడ్డ సిబ్బంది అన్ని వాహనాలను నిశితంగా పరిశీలన చేయాలని అన్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో అకౌంటింగ్ బృందాలు ఫ్లైన్స్ కార్డ్‌వి ఎస్‌టిఎస్ఎస్‌టి బృందాలు ప్రత్యేక బాధ్యత తీసుకొని పనిచేయాలని, సెలవు దినాల్లో కూడా నిఘాపటిష్టంగా పెంచాలని, సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తనిఖీలు చేపట్టాలని, వాహనాల తనిఖీ జప్తు చేసినటువంటి నగదు ఇతర సమాచారం సంబంధించిన రికార్డు సమాచారాన్ని నిర్ధిష్ట ఫార్మాట్‌లలో సంబంధిత అధికారుల ద్వారా రోజువారిగా నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం అసెంబ్లీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి/ ఆర్డీవో దామోదర్ రావు, ఏఈవో వేల్పుల శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌టి బృందం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వీప్ కార్యాచరణలో భాగంగా నేడు బైక్ ర్యాలీ

**ఉద్యోగులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి**

**కలెక్టర్ వి.పి.గౌతమ్**

**ఖమ్మం,మే 9,ప్రభాతవార్త:**



స్వీప్ కార్యచరణలో భాగంగా నేడు సాయంత్రం 5గంటలకు ప్రభుత్వ అధికారులు, సిబ్బందిచే బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ప్రాముఖ్యత తెలుపుతూ, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు వినయోగించకొనెలా అవగాహన, చైతన్యం కొరకు ఈ ర్యాలీ చేపడుతున్నట్లు ఆయన అన్నారు. ఈ ర్యాలీ నేటి సాయంత్రం 5.00గంటలకు నూతన కలెక్టరేట్ వద్ద ప్రారంభమై శ్రీశ్రీ సర్కిల్, జెడ్పి సర్కిల్ గుండా పెవిలియన్ గ్రౌండ్ వరకు చేపట్టబడుతుందని ఆయన తెలిపారు. ఐడిఓసి శాఖాధిపతులతో పాటు సిబ్బంది ఈ బైక్ ర్యాలీలో పాల్గొనాలని, ర్యాలీలో హెల్మెట్ ఖచ్చితంగా ధరించాలని కలెక్టర్ అన్నారు.

## పర్ణశాలను సందర్శించిన ఎన్నికల అబ్జర్వర్



**దుమ్ముగూడెం, ప్రభాతవార్త :**

దుమ్ముగూడెం మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాలను ఐఏఎస్ అదికారి ఎన్నికల అబ్జర్వర్ ప్రచీత్‌రాజు గురువారం సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ప్రతీక్‌రాజును దేవాలయంలోనికి తోడ్కొని వెళ్లి దేవాలయంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం పక్కనే ఉన్న పంచవటి కుటీరాన్ని ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పర్ణశాల ప్రాశస్త్యాన్ని ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ పరితోష్‌పంకజ్, భద్రాచలం ఆర్డీవో కే.దామోదర్‌రావు, దుమ్ముగూడెం ఎమ్మార్వో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మావోల టెక్నాలజీ

**-జీరు సీసాలతో మందుపాతర తయారీ**

**-చెన్నాపురం అటవీ ప్రాంతంలో గుర్తించిన పోలీసులు**

**చర్ల ప్రభాతవార్త:**



మావోయిస్టులు రోజురోజుకు టెక్నాలజీ ఉపయోగించుకోవడంలో నిష్టానితులవుతున్నారు. రాకెట్ లాంచర్ల నుండి తేలికపాటి తుపాకీల తయారీలోనూ తర్ఫీ పొందారు. వీటి కార్మాగారం దండకారణ్యంలో ఇటీవల భద్రతా బలగాలు గుర్తించాయి. ప్రెషర్ కుక్కర్లు టిఫిన్ బాక్సులతో మందుపాతర తయారీ వంటివి చూసాం. తాజా బీర్ బాటిళ్లను ఉపయోగించి మందుపాతర తయారు చేస్తున్నారు. బీరు బాటిల్‌తో తయారు చేసిన మందుపాతరను పోలీసులు గుర్తించి వెలికితీసారు. తెలంగాణ ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులోని చెన్నాపురం సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంపు సమీపంలోని అటవి ప్రాంతంలో మావోయిస్టులు మందుపాతర అమర్చారు. మందుపాతర అమర్చిన విషయాన్ని తెలుసుకున్న పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో ఘటనా ప్రాంతానికి చేరుకొని బీరు బాటిళ్లతో అమర్చిన మందుపాతరను వెలికితీసి అక్కడికక్కడే నిర్వీర్యం చేసారు. నిత్యం ఆ ప్రాంతంలో పోలీసులు సీఆర్‌పిఎఫ్ బలగాల రాకను గమనించిన మావోయిస్టులు వారిని టార్గెట్‌గా చేసి మందుపాతర అమర్చినట్లు తెలుస్తుంది.

# కిష్టారం, యాతాలకుంట గ్రామాల్లో కాంగ్రెస్‌లోకి చేరికలు

సత్తుపల్లి,మే 09,(ప్రభాతవార్త):
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇతర పార్టీల నుండి వచ్చే వారికి ప్రత్యేకంగా చేరికల కమిటీ ఏర్పాటు చేసి తలుపులు తెరవడంతో సత్తుపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్, ఇతర పార్టీల నుండి గత కొన్ని రోజుల నుండి జోరుగా కాంగ్రెస్‌లోకి చేరికలు జరుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 6 గ్యారెంటీల్లో 5 గ్యారెంటీ పథకాలను దిగ్విజయంగా అమలు చేయడంతో పాటు అధికార కాంగ్రెస్ పార్టీ వైపు గ్రామాల్లో ప్రజలు ఆకర్షితులై ఆ పార్టీలో చేరడానికి ముందుకు వస్తున్నారు. సత్తుపల్లి మండల పరిధిలోని కిష్టారం, యాతాల కుంట గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 150 కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పై గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్, నియోజకవర్గ ఎన్నికల కో ఆర్డినేటర్ చల్లగుళ్ల నర్సింహారావు ఆ గ్రామాల్లోకి వెళ్లగా, వారందరికీ మూడురంగుల కండువాను కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. కిష్టారం గ్రామంలో సింగరేణి కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టియుసి జనరల్ సెక్రటరీ నరుకుళ్ల అప్పారావు, మాజీ ఎంపిపి జేష్ట అప్పారావుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీకి 100 కుటుంబాలు రాజీనామా చేసి కాంగ్రెస్ ప్రముఖులు డా. మట్టా దయానంద్, చల్లగుళ్ల నర్సింహారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు ములగలపాటి విష్ణు, ఉడతనేని అప్పారావు, చిలుకూరి మోహన్‌రెడ్డి, నరుకుళ్ల నర్సింహారావు, నరుకుళ్ల రవి,నరుకుళ్ల వెంకటేశ్వరరావు, చాలి ముత్యాలు, నేరేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





**యాతాలకుంటలో 50 కుటుంబాలు చేరిక**

మండల పరిధిలోని యాతాలకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన 50 కుటుంబాల వారు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వీరంతా తమ్మిన రవి, వెల్చా రామప్రసాద్, మధు సుధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో బండి మారేశ్వరరావు, వంకాయలపాటి రామాంజనేయులు, జారె రామకృష్ణ, గుర్రం శ్రీకాంత్ తదితరులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి జిల్లా కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్, నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జి కో ఆర్డినేటర్ చల్లగుళ్ల నర్సింహారావుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పై గ్రామాలకు చెందిన వారిని ఎల్లవేళలా కంటికి రెప్పలా కాపాడుకుంటానని వారికి ఏ సమస్యలున్నా నేరుగా వచ్చి చెప్పి పరిష్కరించుకోవచ్చని మనమంతా ఎంపి అభ్యర్థి ఆర్.రఘురామరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని డా. మట్టా దయానంద్, చల్లగుళ్ల నర్సింహారావులు వారిని కోరారు.

# ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ బిల్డింగ్‌ను పరిశీలించిన జిల్లా అధికారులు

ఎర్రుపాలెం, మే 9, (ప్రభాతవార్త):
మండల కేంద్రమైన ఎర్రుపాలెంలో ప్రతిపాదనలో ఉన్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ కొరకు ఎంపిక చేసిన బిల్డింగ్‌ను గురువారం జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి బొల్లెద్దు శిరీష, క్లస్టర్ ఏపీడీ చుంచు శ్రీనివాసరావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ నర్సరీని





పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులను ఉపాధి హామీ పథకం అమలు, నర్సరీల నిర్వహణ, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై సమీక్షించారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో జిల్లాలోనే ఎర్రుపాలెం మండలంలో అత్యధిక రోజువారి సగటు వేతనం రూ. 217కూలీలకు చెల్లిస్తున్నందుకు, వేతన పేమెంట్ పే ఆర్డర్స్ నూరుశాతం నిర్ణీత సమయంలో పూర్తిచేస్తున్నందుకు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఇదే విధంగా మిగిలిన కాలంలో అన్నిరకాల పనులు ఈజీఎస్‌లో ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని, గ్రామాల్లో పృదనం పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో బి.సురేందర్, ఎంపీవో జి.శ్రీలక్ష్మి, ఏపీవో నాగరాజు, సిబ్బంది జి.గాలయ్య, అనూఫ్, జక్రియా, ఎస్.వెంకటేష్, ఈజీఎస్ సిబ్బంది



పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

## -ఎన్‌జిఆర్ సేవా కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు



నేలకొండపల్లి, మే 9 (ప్రభాతవార్త):
అమరజీవి నూతక్కి గంగాధర్‌రావు సేవా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన నేలకొండపల్లి లోని రావెళ్ళ భవన్ నందు నిర్వహించనున్న 17వ నెలనెల ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎన్‌జిఆర్ సేవా కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు వెల్లడించారు. గురువారం నేలకొండపల్లి లోని రావెళ్ళ భవన్ నందు స్థానిక విలేకరులతో ఏటుకూరి రామారావు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో బిపి, షుగర్‌తో పాటు ఇతర అనారోగ్య సమస్యలకు కూడా ఉచితంగా వైద్య సేవలు అందించనున్నారని ఆయన చెప్పారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కొల్లి అనుదీప్ ఎండి (జనరల్ మెడిసన్), డాక్టర్ సి.భారవి ఎంబిబిఎస్,ఎండి,డిఎం జీర్ణకోశ వ్యాధి నిపుణులు, డాక్టర్ హస్సన్‌బాబా ఎంబిబిఎస్ రోగులకు వైద్య సేవలను అందిస్తారని ఆయన చెప్పారు. అలాగే, శరత్ మాక్స్ విజన్ వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారని ఆయన చెప్పారు. అంతేకాక, షుగర్ పరీక్షలు ముందుగా చేయించుకుని వచ్చే వారికి వెంటనే మందులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. బి.పి, షుగర్ రోగులకు రూ.100లకే మందులు పంపిణీ చేస్తారని ఆయన చెప్పారు. పేదలకు వైద్యంను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే సేవా దృక్పథంతో నెల నెల వైద్య శిబిరంను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ వైద్య శిబిరంకు ప్రజల నుంచి విశేషంగా ఆదరణ లభిస్తోందని ఆయన చెప్పారు. మరిన్ని వివరాలకు ఈ క్రింది సెల్ ఫోన్ నెంబర్లు 9490098225, లేదా 9030897480, లేదా 9949592544, లేదా 9110364581 లలో సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఆర్ సేవా కమిటీ నిర్వాహకులు గుడవర్తి నాగేశ్వరరావు, కేవి రామిరెడ్డి, కట్టెకోల వెంకటేశ్వర్లు, వల్లంచెట్ల భాస్కరరావు పాల్గొన్నారు.




**సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూర్**

# నూతన వస్త్రాలంకరణలో పాల్గొన్న మట్టా దయానంద్



కల్లూరు, మే 9, (ప్రభాతవార్త
మండల పరిధిలోని పుల్లయ్య బంజర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన లక్ష్మీనరసింహారావు, సరస్వతి దంపతుల మనుమరాలు హేత్విక శాన్వి మనుమడు రిత్విక్ విభవ్ నూతన వస్త్రాలంకరణ వేడుకలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ పాల్గొని చిరంజీవులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బస్‌స్టేషన్‌కు విద్యుత్ సదుపాయం కల్పించాలి



దమ్మపేట,ఏజెన్సీ,మే,9,(ప్రభాతవార్త ;
దమ్మపేట బస్టాండ్‌కు విద్యుత్ సౌకర్యాన్ని ఆర్.టి.సి కల్పించాలని ప్రయాణికులు,గ్రామ ప్రజలు కోరుతున్నారు.బస్‌స్టేషన్‌లో రాత్రి సమయంలో ప్రయాణికులు,అందులోను మహిళలు వేచి ఉండలి అంటే విద్యుత్ సదుపాయం లేదు.బస్ స్టేషన్ చీకటిగా ఉండటం వలన ప్రయాణికులు బస్ స్టేషన్‌లో వేచి ఉండలంటే భయనికి లోనవుతున్నారు. దీనితో ప్రదాన రహదారి పైనే వేచి ఉంటున్నారు.వెంటనే బస్ స్టేషన్‌కు రంగులు వేసి విద్యుత్ సదుపాయం కల్పించాలని దమ్మపేట గ్రామ ప్రజలు,ప్రయాణికులు కోరుతున్నారు.ఆనాడు గ్రామస్తుల కోరిక మేరకు జలగం ప్రసాద్ దమ్మపేట బస్‌స్టేషన్ నిర్మించి ఏప్రిల్ 5,1994,న ప్రారంభించారు.ఆనాటి నుండి బస్‌లు రాకా అలంకారప్రాయంగానే మిగిలి బాటసారులకు నిలయంగా మారింది.బస్ స్టేషన్ బాగుచేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు గ్రామస్తులు విజ్ఞప్తిచేశారు.ఎమ్మెల్యే కృషితో ఈమధ్యకాలంలో అపరి శుభ్రంగా ఉన్న బస్‌స్టాండును బాగుచేసి బస్‌స్టాండ్ లో ఒక రిటైర్డ్ ఉద్యోగిని నియమించటం హర్షణీయమని,భద్రచలం,కొత్తగూడెం సర్వీసులతో పాటు సత్తుపల్లి నుండి అశ్వరావు పేట వరకు వెళ్లే ప్రతి సర్వీసు బస్‌ను దమ్మపేట బస్టాండ్‌కు వచ్చివెళ్ళే విధంగా ఆధికారులు చర్యలు చేపట్టలని,మండల కేంద్ర మైన దమ్మపేటకు బస్ సర్వీసులు నడపాలని కోరారు.రవాణా వ్యవస్థ మెరుగుపడితే మండల కేంద్రం మరింత అభివృద్ధి చెందుతుందని తద్వారా వ్యాపారాలు అభివృద్ధి చెంది పదిమందికి ఉపాధి కలుగుతుందని గ్రామప్రజలు ఆశాభావం వ్యక్తంచేశారు.